# కథ ముగియ లేదు

మరువాడ రాజేశ్వరరావు

ఈ కథ ఏ ఉళ్ళో జరిగిందని మీరడిగితే నేను చెప్పలేను: అప్పలమ్మా, అప్పల్సాఁవి ఏ ఊళ్లో ఉన్నారో, ఆ ఊళ్ళోనే జరిగింది. వాళ్ళిద్దరికీ ముగ్గురు పిల్లలున్నారు కాని, వాళ్ళ కథ యిందులో లేదు. అది రేపటి కథ.

అప్పలమ్మ ఆడకూలి. అప్పల్సాఁవి మగకూలి. రాళ్ళు మోసే కూలీలు. వాళ్ళిద్దరి మధ్యా రొమాన్స్ జరిగే ఉంటుంది కాని, ఆ కథా యిందులో లేదు.

ఇవేవీ కాకపోతే మిగిలేది ఆకలే కనక, యిది తప్పకుండా ఆకలికథే నంటారేమో. ఆకలేకాకుండా వాళ్ళలో మరోటికూడా వుంది. దాన్నిగురించే ఈ కథ.

అప్పల్సాఁవి గురించీ, అప్పలమ్మ గురించీ కథ చెప్తానంటున్నాను గాని, మాష్టారూ! నిజం చెప్తున్నాను. వాళ్ళ గురించి నాకేఁవీ తెలీదు కొంచెం పెద్ద గుమాస్తాగా నాలుగురాళ్లు సంపాయించుకుని, పెద్దవాళ్ళ దయవల్ల పస్తుల్లేకుండా అప్పుడప్పుడు పాలుకూడా తాగుతూ బతికేస్తున్నాను. నాకు వాళ్ళగురించి తెలుసుకునే అవకాశమూ లేదు, ఆ ఉత్సాహంకూడా తగినంతగా లేనట్టే అనిపిస్తోంది. ఆ ఉత్సాహం ఉంటే మరోలాగ బతకాల్సినవాడ్ని.

అందుకేనేమో, వాళ్ళ పేర్లు తల్చుకోగానే లక్షలాది జనం కళ్ళముందు నిలబడ్డారు— 'నేనే, నేనే అప్పల్సాఁవి'నంటే, 'నేనే అప్పలమ్మ'నంటూ. నేను రాళ్లమోసి బతుకుతున్నానని కొందరంటే, రాళ్లే కాదు బస్తాలుకూడా మోసేనని కొందరు; రాళ్ళు మోసేకాదు రాళ్ల కొట్టికూడా బతుకుతున్నానని కొందరంటే, ఎప్పుడో రాళ్లమోసే ఉంటాను. ఇప్పుడు ఫేక్టరీలో, 'వర్కర్నై' బతుకుతున్నానని కొందరు... అంత మంది జనాన్ని, అంతమంది కాయకష్టంచేసే జనాన్ని, అందరూ ఒక్కరిలాగే కనబడుతూ ముందుకి తోసుకొస్తున్న జనాన్ని... నా బతుకు బతికే వాడెవడేనాచూస్తే భయపడిపోయి, గుండాగి ఛస్తాడు. నేను మాత్రిం భయపడలేదు. అందుకే యీ కథ చెప్తున్నాను.

అప్పల్సాఁవీ, అప్పలమ్మా కాకుండా మరో రెండు పేర్లు పెడదాఁవంటే, ఆ పేరూ నాదేనంటూ ముందు కొస్తున్నారు జనం. అసలు విషయం ఏమిటంటే, మనం అప్పల్సాఁవి గురించీ అప్పలమ్మ గురించీ వేరే చెప్పుకోడానికి వాళ్ళేం ఆస్తిపరులా,

ఆఫీసర్లూ, అధికారులూ, ఆర్టిస్టులూకాదు. వాళ్ళు కూలీలు, కూలీల గురించి ఏక వచనంలో చెప్పుకోవడం అసాధ్యం. అందుచేత,

రాళ్ళు మోసే కూలీలు!

రాళ్ళు మోసే కూలీలకి రాళ్ళుమోసిన్దాని విలువ,—మొగ కూలికి రెండు రూపాయలూ, ఆడ కూలికి రూపాయిన్నరా.

'బగ్మంతుడి'కి చేతులెత్తి మొక్కుతారు వాళ్ళు 'ఆ బాబుదయ'!—ఆ బాబు దయ అంతకన్న హీనంగా లేనందుకు వాళ్ళు సదా కృతజ్ఞులు.

'రోజంతా రాళ్ళు మోసిన్దానికీ, రెండు (మగ) రూపాయలు లేదా ఒకటిన్నర (ఆడ) రూపాయి జీవితపు విలువ సరిగ్గా సమానమని అర్థికశాస్త్రం చెప్తోంద'ని మనలో ఎకనమిక్సు చదువుకున్న వాళ్ళకి తెలుసు. మనుష్యులకి బతుకుమీద తీపి అంత(లో)గా ఉందిట. అంతకన్న తక్కువిస్తే మనుష్యులకి బతుక్కన్నా చావంటేనే ఎక్కువ యిష్టంగా ఉంటుందిట. వాళ్ళు చచ్చిపోతే రాళ్ళు మోయించుకునే పెద్దమనిషికి రాళ్ళు మోసే వాళ్ళు దొరకరుట.

అందుచేత 'న్యాయం' అక్కడే, అలాగ స్థిరపడి పోయింది. 'న్యాయం'వల్ల 'లాభం' పుడుతోంది. లాభాన్ని కాపాడ్డానికి ఎందరెందరో జీతగాళ్ళు... ఎన్నికలు, మంత్రులు, న్యాయస్థానాలు, పోలీసు ఠాణాలు, శాసనాలు, తుపాకులు...

యివన్నీ మనకి తెలుస్తాయి కాని, అప్పలమ్మకీ, అప్పల్నాయిడికీ తెలీవు. ...తెలియకుండా ఉండి పోతాయా? మనకి తెలిసినట్టు కాకపోతే మరో రకంగా తెలుస్తాయి. తెలిసినప్పుడు మనలాగ కాకుండా మరో రకంగా ప్రవర్తిస్తారేమో!

* * *

రాళ్ళు మోస్తున్నారు కూలీలు...

బజార్లో చవక రకం బియ్యం ఖరీదు పది పైసలు పెరిగింది... రెండు రూపాయల జీవితపు విలువ పది పైసలు తగ్గింది.

యివాళకన్న రేపు ధర పెరుగుతుందంటే యివాళ కొనుక్కుని రేపు అమ్మేడం లాభం. రేపు ధర తగ్గుతుందంటే యివాళ అమ్మేసి రేపు కొనుక్కోవడం లాభం. యిది లాభాల వ్యాపారం. (లాభం లాభేన లభ్యతే!) ఈ వ్యాపారం ఎంత ఎక్కువగా జరిగితే ధరలు అంతగా పెరిగిపోతాయిట. ధరలు పెరుగుతున్న కొద్దీ వ్యాపారస్తులు సరుకు కొనేసి దాచేసుకుంటూ ఉంటే, బజార్లో సరుకు తగ్గిపోతూ ఉంటే, ఆ కారణం

చేత ధరలు మరింతగా పెరిగిపోతూ ఉంటే, వ్యాపారస్తులు మళ్ళీ సరుకుకొనేసి దాచేసుకుంటూ ఉంటే ఆకాశం అంత ఎత్తుగా ధరలు; బజార్లో సరుకు 'హూత్‌కాకీ'!

నల్లటి చీకటి గోదాముల్నిండా సరుకులుంటాయి, అవి కొనుక్కోవాలంటే, నువ్వు ఆకాశంకన్నా కొంచెం ఎక్కువధరే యివ్వాలి.

బజార్లో సరుకు దొరకదు కాని నల్లబజార్లోకన్నా ధర తక్కువే. ఆ ధరే పది పైసలు పెరిగింది.

'ఇప్పటి పరిస్థితుల్లో బియ్యం ధర పెరగడం ఆర్థికశాస్త్ర సమ్మతమే'నన్నాడు ఆర్థికశాస్త్రవేత్త.

అది కూలీలకి తెలియదు.

అప్పలమ్మా, అప్పల్సామీ కళ్లు మూసుకుని చేతులు జోడించి 'బగమంతుడికి' మొక్కేరు. మూసుకున్నకళ్లు తెరిచేసరికి వాళ్ళ కంటి రెప్పలచుట్టూతడి. కళ్లు మసక మసగ్గా కనిపించేయి.

ఆ సాయంత్రమే కూరగాయలధర పది పైసలు పెరిగింది. గుడ్డముక్కలధర పాతికపైసలు పెరిగింది. ఉప్పుధర పెరిగింది. పప్పుధర పెరిగింది. చుట్టముక్కల ధర పెరిగింది. కుండలూ మండలూ ధర పెరిగిపోయేయి... ధరల చీకటి యెంతకీ తెల్లవారదనే భయంతో నిద్రధర పెరిగింది.

.. కూలీల నెత్తిమీద బరువు అంతగానూ పెరిగిపోయింది.

ఇదంతా అత్యంతసహజంగానూ, ప్రకృతిసిద్ధంగానూ జరిగిపోయిందని సూత్రీకరించిన ఆర్థిక శాస్త్రవేత్త జీతం పెరిగింది.

ఎండలు మంటలయేయి. మంటలు సెగలు గుప్పించేయి. ఆవిర్లెత్తించేయి ఆవిర్లు శరీరాన్ని ఉడకబెట్టేయి. రక్తాలు చెమటలై కూలీల శరీరాలు కట్టెలయేయి. కళ్ళుకాలి నిప్పుల కణికలే అయేయి. ఎండ పొగలు పొగలుగా కూలీల చెవుల్నీ, నాసికా రంధ్రాల్నీ ఆక్రమించుకుంది. చెప్పుల్లేని కాళ్ళలోంచి ఎండ విద్యుత్తులాగ ప్రవేశించి తలమీదుగా పైకి పోవాలని ప్రయత్నించి, పోలేక, తలలు బద్దలుకొట్టింది. బద్దలేకున్న తలలమీద బరువులు మరింత బరువెక్కిపోయేయి...గొంతుకెండినకూలీలు గుక్కెడు సోడానీళ్ళ కోసం— ఉప్పు, నిమ్మకాయ కలిపిన సోడా నీళ్ళ కోసం పరుగులెత్తేరు...

సోడా నీళ్ళ ధర పెరిగిపోయింది!

ప్రాణాలు ఉస్సురన్నాయి. నీరసం చావులాగ నరనరాల్లోకీ పాకిపోయింది.

బరువు మరి భరించరానిదై పోయింది. నీతిలేని న్యాయం మరోచోట బీట వేసింది... కూలీల శరీరాల్లో రక్తం ఎండకన్న వేడి వేడిగా మరిగిపోయుంది.

జీతాలు పెరగాలని సమ్మెచేసేరు కూలీలు.

ఏర్‌కండిషన్డ్ గదిలో, అప్పుడే నిద్రలేచిన, రాళ్ళు మోయించుకునే పెద్ద మనిషికి సమ్మె వార్త ఎర్రని ఎండలాగ చురుగ్గా తగిలింది.

* * *

అప్పల్సాఁవి 'నిరాహారదీక్ష' లో కూర్చున్నాడు. అప్పలమ్మ కూలీల ప్రదర్శనలో పాల్గొంది.

సమ్మె 'శాంతియుతం'గా జరుగుతోంది. పని జరక్కపోతే పెద్దమనిషికి నష్టం వస్తుంది. నయాన చెప్పించేడు. కూలి జనం వినలేదు. భయాన చెప్పించేడు. చెప్పిన వాళ్ళ పళ్ళు రాలి పోయేయి. ...సమ్మె దౌర్జన్య కాండగామారిందని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించేరు. శాంతిని కాపాడమని పోలీసుల్ని పంపించేరు.

శాంతి కాముకుల లాఠీలు అశాంతుల తలలమీద విరిగేయి... శాంతి ధర పెరిగింది. అశాంతి బరువెక్కింది.

సమ్మె ఆగలేదు.

(కంటిమీద దెబ్బ తగిలిన అప్పలమ్మ ఆస్పత్రికెళ్ళింది. ఆకలికో, ఎండలకో శోషవచ్చి పడిపోయిన చంటి కూతురు చావు బతుకులమధ్య ఉంది. పిల్లల ఆకలి చూస్తూన్న అప్పల్సాఁవికి తన ఆకలి తెలియలేదు. సాలెగూడుని ఛేదించకుండా సాలె పురుగుతో పోరాడ్డం నిష్ప్రయోజనం.)

కూలి జనం, యిక ముందు సమ్మె ఎలా జరగాలో నిర్ణయించుకునేందుకు మీటింగు జరిపేరు.

తెల్ల లాల్చీ, తెల్ల పైజామా వేసుకున్న చప్పిడిముక్కు నల్లమనిషి— కూలీల సంఘం నాయకుడు కంచు గంట లాంటి కంఠం విప్పి మాట్లాడేడు. 'దౌర్జన్యం నశించాలి' అని గర్జించేడు. 'మనం శాంతియుతంగానే పోరాడతాం' అని యింకా గట్టిగా గర్జించేడు. 'చర్చలు జరుపుకుందాం, ఢిల్లీ గాని, లేదా కనీసం హైదరాబాదుగాని వెళ్ళి మంత్రులతో మాట్లాడదాం' అని నొక్కి వక్కాణించేడు. అందుకు అయే ఖర్చులకిగాను ఒక్కొక్కరు పావలా పావలా యివ్వండని అర్థించేడు.

అతనలాగ మాట్లాడుతూ వుండగానే జనంలో ఏదో ధ్వని మొదలైంది. ఆధ్వని

767

లో ఉద్రిక్త తరంగాలు... యిటూ అటూ తిరిగే కూలీల తలలు... ఆవేశంగా ఏదో చెప్పుకుంటున్న పెదాలు... బిగించిన పిడికిళ్లు...

తన మాటలు యెవరూ వినడంలేదని తెలిసిపోయింది నాయకుడికి. 'భారత్ మాతాకీ జై, మహాత్మా గాంధీకీ జై 'అని మంత్రం చదివేడు. మంత్రం పని చెయ్య లేదు. జనం ఏదో నిశ్చయానికొచ్చి పరిగెడుతున్నారు. నాయకుడు చెప్పేది వినిపించుకోకుండా పరిగెడుతున్నారు.

బజార్లో సరుకుల్లేక పోయినప్పటికీ, నల్లగోదాముల్నిండా సరుకులేనట!— ఆ సరుకులు మోసిన వాళ్ళు చెప్పేరు. అది విన్న జనం పరిగెడుతుంటే నేల అదిరి పోయింది. నాయకుడు మరో దారంట పారిపోయేడు.

గోడల్ని పగల కొట్టేరు జనం.

చీకటి విరిగి పోయింది. బియ్యం, గోధుమలు... తిండి! తిండి!

పంచుకున్నారు జనం

'అయ్యయ్యో' రేపు పెరగాల్సిన ధరలు!'

'హయ్యయ్యో, వ్యాపారం !'

వర్తకులు కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చేరు.

'దుండగుల మూకలచే, ఆహారధాన్యాల దోపిడీ !'—వార్తా పత్రికలు.

'న్యాయం ! న్యాయం ?'...పత్రికల్లో, ప్రముఖుల హాహాకారాలు.

'లూటీ. లూటీ... దౌర్జన్యం'— ఆర్థిక శాస్త్రవేత్త.

శాంతికపోతం తుపాకుల్ని మీటింది. తుపాకులు కొందరి గుండెల్ని దూసుకు పోయి మరికొందరి గుండెల్ని 'మీటేయి' (అప్పల్నాం(వి చచ్చిపోయేడు. అది విన్న అప్పలమ్మ గోడుగోడుమంటూ ఆస్పత్రివాదిలి వీధిలో కొచ్చేసింది. చంటి కూతురు చచ్చిపోవడం చూసి ఆమెగుండె యినుములాగ కరిగి కరిగి, గట్టిపడిపోయింది.)ఆయుధాల్లేని జనం ఎదురు తీరగలేక పోయేరు. వాడ వాడనా 'న్యాయా'నికి తుపాకీలరక్షణ. అరెస్టులు... పత్రికలకెక్కని హింసాకాండ— జైళ్ళలో, పోలీసు ఠాణాల్లో...జనం— ఎవరిళ్ళలో వాళ్ల బందీలు... ఏం చెయ్యాలో తెలియని జనం...పరాయి దేశానివికావు. స్వదేశానివే— తుపాకులు, 'స్వ'జనంమీదికే యెందుకు తిరిగేయో అర్థంకాని జనం... ఆకలి వెయ్యడమే తప్పో, ఉన్న సరుకు 'లేద'ని దాచుకున్న వాళ్ళ గోడలు పగలకొట్టడమే తప్పో,— ఏది తప్పో, ఎందుకు తప్పో అర్థంకాని జనం... ప్రజాస్వామ్యంలో 'మెజారిటీ'జనం... 'వేడి' చల్లారుతోందని పత్రికల్లో ప్రకటన!

కూలీల తెల్లలాల్చీ నాయకుడు పెద్ద మనుష్యుల్తో చర్చలు జరిపేడు. బేరాలు జరిగి, కూలి ధర మరో పది పైసలు పెరిగింది.

'సమ్మె జయప్రదమైంద'న్నాడు నాయకుడు... కూలీల రక్తంతో తడిసినశాంతి కపోతం, ఎంత కడుక్కున్నా వొదలని రక్తపు మరకలమీద తెల్లరంగు వేయించుకోడానికి రాచకవుల్నీ, పత్రికలవాళ్ళనీ ఆశ్రయించింది.

సమ్మె ఆగిపోయింది.

*  *  *

ఆగండి మాష్టారూ, అక్కడితో అయిపోలేదు. జీతాలు పెరగడంతో కథ లెప్పుడూ అయిపోవు. కావాలంటే ప్రభుత్వాన్నడగండి. ఇలా పెరగడానికిగల కారణాలగురించి 'ఎంక్వయిరీ' జరుపుతామనీ, ఇకముందు యిటువంటివి జరక్కుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామనీ ప్రకటించేరు.

కాదంటే కూలీల తెల్లలాల్చీ నాయకుణ్నడగండి. ముందు ముందు జరగబోయే సమ్మెలు తన చెయ్యి జారిపోకుండా వుండాలంటే ఏం చెయ్యాలో పథకాలు వేసుకుంటున్నాడు.

సమ్మె జరగడానికి ముందు తమ బ్రతుకులెలాగుండేవో, తరువాతా అలాగే వున్నాయంటున్న కూలి జనాన్నే అడగండి.

ఈ బరువులిలా పెరుగుతాయేతప్ప తగ్గవు, తగ్గవని తెలిసినవాళ్ళు, ఈ జీవితం విలువ తగ్గుతుందే తప్ప పెరగదు పెరగదని అర్థం చేసుకున్నవాళ్ళు...

శాంతి కపోతం మీటిన తుపాకులు మీటిన గుండెలవాళ్ళు...

ఈ 'న్యాయం' అన్యాయమనీ, అన్యాయం చేతిలోని తుపాకుల్ని ఎదుర్కొనేందుకు, కొత్త సంగీతం ఆలపిస్తూ కొత్త సమాజం కోసం తుపాకులు పట్టిన వాళ్ళు...

వాళ్ళనడగండి.

పిల్లలిద్దర్నీ తీసుకుని అప్పలమ్మ ఊరువిడిచి ఎక్కడికెళిపోయిందో, ఎందుకు వెళిపోయిందో, మళ్ళీ ఊళ్లోకెప్పుడొస్తుందో ,ఏం తీసుకు వస్తుందో...

---

'విమోచన'
రాజకీయ పక్ష పత్రిక

శీర్షిక:-

ప్రశ్నలు - జవాబులు ( ప్రజ ) (మార్క్సియన్ సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి తోడ్పడే ప్రశ్నలకు సమాధానాలివ్వబడుతాయి. పాఠకుల్ని ప్రశ్నలు ఈ కింది అడ్రెస్‌కు పంపాల్సిందిగా కోరుతున్నాం.)

సాలు చందా: 10-00 రూ. ఎడిటర్ : విమోచన

విడిప్రతి: 0-40 పై. 3-9-117, హన్మకొండ, వరంగల్

769